

# జోలాలి.. జోలాలి

**గోధూళి** వేళలో గువ్వలన్నీ గూళ్లకు చేరుకుంటాయి. తల్లి పక్షులు తెచ్చిన గింజలు తిని.. సంధ్యారాగపు సరిగమలు వింటూ నిద్రలోకి జారుకుంటాయి. వే'కువకువలు' మొదలయ్యాకే పిల్ల పక్షులు బద్ధకంగా రెక్కలు ఆడించే ప్రయత్నం చేస్తాయి. అవి వాటి టైమింగు! మునిమాపు వేళ ముంచుకొచ్చే నిద్ర బుల్లిపిట్టలకే కాదు ముద్దులొలికే బుజ్జాయిలకూ వరమే. లాలిపాట లేకున్నా.. ఆ సమయంలో ఇంత లాలపోస్తే చాలు.. నిద్రలోకి జారుకుంటారు. గాఢంగా నిద్రపోయే చిన్నారుల ఆరోగ్యం భేషుగ్గా ఉంటుందని పలు అధ్యయనాలు జోలపాడి మరీ చెబుతున్నాయి. పసిపిల్లలు రోజుకు 12 నుంచి 16 గంటలు నిద్రించాలని నిపుణుల సూచన. ఏడాది నుంచి రెండేండ్లలోపు పిల్లలు 8 నుంచి 12 గంటలు నిద్రపోవాలట. పసివయసులో సరైన నిద్ర లేకపోతే.. వారి ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. అందుకే, పిల్లలకు నాణ్యమైన నిద్ర అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే!

### రోజూ అదే తీరుగా..

చాలామంది తల్లిదండ్రులు పసిపిల్లల నిద్ర విషయంలో సరిగ్గా అంచనా వేయరు. వాళ్లకు పని ఉన్నరోజు.. బుజ్జాయిని భుజాన వేసుకొని తెగ ఊపుతూ, నిద్ర పుచ్చుతారు. ఇంకోరోజు.. కునికిపాట్లు పడుతున్న చిన్నారిని బలవంతాన మేల్కొల్పుతూ ఉంటారు. ఈ రెండు వైఖరులూ తప్పే! కడుపు నిండా తిండి ఉంటే.. కంటి నిండా నిద్రపోవడానికి వాళ్లు సదా సిద్ధంగా ఉంటారు. మీ పిల్లల రెగ్యులర్ నిద్రవేళలను గమనిస్తూ.. అందుకు తగ్గట్టుగా వాళ్లను పడుకోబెట్టాలి. పనులుంటే తర్వాత చక్కబెట్టుకోవచ్చు. మీ తొందర కోసం వారి నిద్రను చిందరవందర చేయొద్దని గుర్తుంచుకోండి.

### పరిసరాలు శుభ్రం

కొందరు పిల్లలు చీమ చిటుక్కుమన్నా చటుక్కున లేచిపోతారు. ఇలాంటి పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండటం అవసరం. ముఖ్యంగా ఈగలు, దోమల బెడద లేకుండా చూసుకోవాలి. మెత్తటి పక్క పరచాలి. కాలానికి తగ్గట్టుగా దుస్తులు వేయాలి. మృదువైన దుప్పటి చెవులను మూస్తూ కప్పి నిద్రపుచ్చాలి. అతి వెలుతురు, అనవసరమైన శబ్దాలూ లేకుండా జాగ్రత్తపడాలి.

### కథలు చెప్పాలి..

ఏడాదిన్నర, రెండేండ్లు దాటిన చిన్నారుల నిద్ర సమయం సహజంగానే తగ్గుతుంది. మధ్యాహ్నం పూట ఓ రెండు గంటలు పడుకుంటే.. అర్ధరాత్రి దాటేదాకా నిద్రాదేవికి తలొగ్గరు. ఇలాంటి చిచ్చర పిడుగులను కథలతో కట్టిపడేయాలి. చిట్టిపొట్టి కథలు చెబుతుంటే.. ఊఁ కొడుతూ బజ్జుండిపోతారు. పగటి పూట, సాయంత్రాలు పిల్లలను ఆడిస్తే.. రాత్రి త్వరగా పడుకుంటారు. కొందరు పిల్లలకు నిద్రలో పక్క తడిపే అలవాటు ఉంటుంది. పక్క తడిపిన తర్వాత నిద్రాభంగం అవుతుంది. అలాకాకుండా ఉండాలంటే పడుకునే ముందు వాష్‌రూమ్‌కు వెళ్లొచ్చే అలవాటు చేయడం మంచిది.

నమస్తే తెలంగాణ

# జిందగీ

హైదరాబాద్ | బుధవారం 14 ఆగస్టు 2024 www.ntnews.com





# లోపం లేదు.. పిల్లలూ లేరు.. ఎందుకిలా?

జిందగీ క్లినిక్

**హలో డాక్టర్ గారు. ఇటీవల అన్ ఎక్స్‌ప్లెయిన్డ్ ఇన్‌ఫెర్టిలిటీ అనే పదాన్ని వింటున్నాం. అంటే ఏమిటి? ఇది మనదేశంలోని దంపతుల్లోనూ కనిపిస్తున్నదా?**

**• ఓ పాఠకురాలు**

**భార్యాభర్తలిద్దరిలో** ప్రత్యుత్పత్తి వ్యవస్థకు సంబంధించి ఎలాంటి లోపమూ లేకపోయినా పిల్లలు కలగకపోవడాన్ని 'అన్ ఎక్స్‌ప్లెయిన్డ్ ఇన్‌ఫెర్టిలిటీ' అంటారు. మనదేశంలోనూ ఈ కేసులు ఉన్నాయి. పేరుకు తగ్గట్టే కారణం ఏమిటీ అన్నది అర్థం కాని సమస్య ఇది. పిల్లలు పుట్టడం లేదంటూ మా దగ్గరికి వచ్చే భార్యాభర్తలిద్దరికీ డాక్టర్లుగా మేం కొన్ని పరీక్షలూ, ప్రయత్నాలూ చేయాల్సి ఉంటుంది. అయితే ఎలాంటి సందర్భంలో దాన్ని ఇలా పిలుస్తాం అంటే...



**అమ్మాయికి** గర్భాశయంలో లోపం లేదు, సరిగ్గా అండం విడుదల అవుతున్నది, గర్భాశయ నాళాలు తెరుచుకునే ఉన్నాయి.. సంభోగానికి ఏ విధమైన అడ్డంకీ లేదు. వయసు 35 లోపే ఉంది. అటు అబ్బాయికి సంభోగ సమయంలో ఎలాంటి సమస్య లేదు, వీర్యంలో కణాల కదలికలు, వీర్యం నాణ్యత.. ప్రామాణికంగానే ఉన్నాయి! తరచుగా సెక్స్‌లో పాల్గొంటున్నారు. పెండ్లయి రెండేండ్లయింది. ఇద్దరిలో షుగర్ లేదు, హార్మోన్‌లు సమతులంగానే ఉన్నాయి! ఇవన్నీ తేలాక... ఆరు నెలలు అండం సరిగ్గా సమయానికి విడుదల అవ్వడానికి మందులు ఇస్తాం. ఆ సమయంలో సంభోగం చేయమని చెబుతాం. ఇలా అండం ఏ సమయంలో విడుదల అవుతుంది అని తెలుసుకునేందుకు ఫాలిక్యులర్ స్టడీ అని ప్రత్యేక పరీక్ష చేస్తాం. ఓవులేషన్ కిట్స్ ద్వారా కూడా ఇది తెలుస్తుంది. ఈ ప్రయత్నం చేసినా ఫలితం రాకపోతే.... అమ్మాయి లోపలి అవయవాలను నేరుగా చూసేందుకు ఎండోస్కోపీ చేస్తాం. గర్భాశయం, గర్భాశయంలోపల ఎలా ఉన్నది అన్నది పరీక్ష చేస్తాం. మరో పద్ధతి ద్వారా గర్భాశయపు లోపలి పొరనూ చూస్తారు. ఇవన్నీ నార్మల్‌గానే ఉన్నాయి. కానీ పిల్లలు కలగడం లేదు అంటే... దాన్ని 'అన్ ఎక్స్‌ప్లెయిన్డ్ ఇన్‌ఫెర్టిలిటీ' అంటారు.

**సంభోగం** సమయానికి సవ్యంగా జరిగినా అండం ఫలదీకరణ చెందిందా లేదా అన్నది మనకు తెలియదు. అండం విడుదల అవుతున్నదని తెలుసు, వీర్య కణాలు బాగున్నాయని తెలుసు.. కానీ ఎందుకు ఫలదీకరణం చెందడం లేదు, ఎందుకు పిండం ఏర్పడట్లేదు అన్నది మనకు తెలియదు. దానికి ఇంకా పరీక్షలు రాలేదు. ఫెర్టిలిటీ సెంటర్ల వాళ్లు ఇంకాస్త లోపలికి వెళ్లి... జన్యువుల్ని అర్థం చేసుకోవడానికి మగవాళ్లలో డీఎన్ఏ ఫ్రాగ్మెంటేషన్ చేస్తారు. మహిళల్లో అయితే గర్భాశయపు లోపలి పొర తీసి పరీక్ష చేస్తారు. అయినా కొన్నిసార్లు ఏమీ తేలదు. కొన్ని సందర్భాల్లో అండం ఫలదీకరణం చెందుతుంది. కానీ అది ఇమడదు. ఇక అప్పుడు ఫెర్టిలిటీ సెంటర్‌కి వెళ్లమని చెబుతాం. అక్కడ ముందుగా ఐయూఐ చేస్తారు. అంటే ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా అండం విడుదలయ్యేలా చేసి, వీర్యకణాలను సేకరించి శుభ్రపరచి నేరుగా గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. అదే అండం క్రమం తప్పకుండా సమయానికి విడుదలయ్యే వారిలో అయితే, ఆ సమయాన్ని గుర్తించి వీర్య కణాలు ప్రవేశపెడతారు. ఇలా మూడుసార్లు చేస్తారు. అయినా నెలతప్పక పోతే... అప్పుడు ఐవీఎఫ్‌కు వెళతారు. అంటే అండాన్ని పరీక్షనాళికలోనే ఫలదీకరణం చెందించి దాన్ని గర్భాశయంలో ప్రవేశపెడతారు. దీన్నే టెస్ట్‌ట్యూబ్ బేబీ అంటారు. అయితే పేరు పొందిన ఫెర్టిలిటీ సెంటర్లలోనూ ఇందులో 50 శాతం కేసులు మాత్రమే విజయవంతం అవుతున్నాయి. అంటే, దానిద్వారా ప్రసవం అయ్యి పాపాయి చేతుల్లోకి రావడానికి అక్కడా సగమే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి ఈ పద్ధతి ద్వారా కూడా బిడ్డలు పుడతారని గ్యారెంటీ ఏమీ లేదు. అయితే... ఇవన్నీ జరిగాయి కాబట్టి ఇక వాళ్లకు పిల్లలే కలగరు అని చెప్పలేం. అన్ని ప్రయత్నాలు చేసి, విసిగిపోయి సాదా జీవితాన్ని గడుపుతున్న వాళ్లకు పిల్లలు కలిగిన సందర్భాలూ ఉన్నాయి. ఎవరో ఒకరిని దత్తత తెచ్చుకున్నాక గర్భం వచ్చిన సందర్భాలూ ఉన్నాయి.



**డాక్టర్ పి. బాలాంబ**
సీనియర్ గైనకాలజిస్ట్

**నిజానికి** ఇలా పిల్లలు పుట్టడం లేదు... అని గైనకాలజిస్టు దగ్గరికి వచ్చినప్పుడు మేం పరీక్ష చేసి అండం విడుదల అవుతున్న సమయం గుర్తించి, ఆ సమయంలో కలవమని చెబుతాం. 90 శాతం మంది అప్పుడే నెలతప్పుతారు. కేవలం పది శాతం మందికే ఫెర్టిలిటీ సెంటర్లకు వెళ్లమని సూచిస్తాం.

**శాస్త్రీయ నృత్యం రంగమంటపంపై రంజిల్లాలంటే.. ఆంగికం కట్టిపడేయాలి. ఆహార్యం ఆకట్టుకోవాలి. నాట్యకళాకారిణి మనసు తాదాత్మ్యం చెందాలి. అప్పుడే ఆ నృత్యం రసికుల హృదయాలపై ఆనంద తాండవం చేస్తుంది. శాస్త్రీయ నృత్యరీతులకు పట్టుగొమ్మ భారతావనిలో లాస్య విన్యాసాలు యథాలాపంగా ఆవిష్కృతం అవుతాయి. ఎల్లలు దాటిన మన కళాకారులు ఎందరో తమ అభినయ వేదంతో విదేశీయుల మనసులు కొల్లగొట్టిన సందర్భాలూ ఉన్నాయి! భారతావనికి వచ్చి.. శాస్త్రీయ నృత్యరీతుల్ని ఉపాసించిన విదేశీయులు ఉన్నారు. అయితే, చైనాలో పుట్టిపెరిగిన చిన్నది, అక్కడే గజ్జెకట్టి, భరతనాట్యంలో పట్టు సాధించి.. చైనా గడ్డపై అరంగేట్రం చేసిన తొలి నర్తకిగా కీర్తి గడించింది మాత్రం లీ ముజి. ఈ పదమూడేండ్ల చిన్నారి ఇప్పుడు సోషల్ మీడియా సెలెబ్రిటీ. ఇండో చైనా సంస్కృతులకు వారధి.**



# చైనాలో భరతనాట్యం

లీ ముజి

**ఆదివారం..** బీజింగ్ నగరంలో ఓ నాట్యమండపం. డ్రాగన్ నృత్యాల దరువుకు అదిరిపడే ఆ వేదికకు కొత్త అనుభూతి! మెత్తటి పాదాలు సుతిమెత్తగా తాకుతున్నాయి. కృష్ణుడి పాదాలు మోదుతున్నప్పుడు పులకించిన కాళీయుడిలా తన్మయానికి లోనైంది ఆ చైనా తలం. ఆ పారవశ్యంలో ఓ పాదాన్ని హత్తుకునే లోపే.. మరో పాదం మరింత మత్తుగా తాకుతున్నది. పాదరసంలా కదులుతున్న ఆమె అడుగులకు మడుగులొత్తడం ప్రారంభించింది ఆ నాట్యవేదిక. మువ్వల మురళి వంత పాడుతూ పరవశించింది. ఘల్ ఘల్ అని ఒకసారి.. ఝణఝణ అంటూ మరోసారి! అందెల రవళితో పందెం వేసుకుందేమో... అంబరాన్నంటేలా నాట్యం చేస్తున్నది లీ ముజి. ఆమె నాట్యానికి భారతీయం సరిహద్దులు చెరిపి.. చైనా రాజధాని బీజింగ్ దాకా దూసుకెళ్లింది.

**ఎటుచూసినా** చీమ కండ్లేసుకున్న చీనీయులే! అక్కడక్కడా భారతీయులు. వారంతా ప్రత్యేక ఆహ్వానితులు. భరతనాట్యంలో దిట్ట అనిపించుకున్న లీలా శాంసన్ ఒక వైపు, చైనాలో భారత రాయబార కార్యాలయం ప్రతినిధులు మరోవైపు. వీరందరికీ లీ ముజిని పరిచయం చేసింది ఆమె గురువు జిన్ షాన్‌షాన్. చీనాంబరాలు కట్టుకున్న చీమకండ్ల చిట్టితల్లికి ఆంగిక అభినయాలు దగ్గరుండి నేర్పించింది ఆవిడే! తన శిష్యురాలు నాట్య విన్యాసాన్ని చూసి పులకించిపోయింది.

**ప్రసార** మాధ్యమాలు హోరెత్తుతున్న ఈ రోజుల్లో.. సామాజిక మాధ్యమాలు విజృంభిస్తున్న నేటి యుగంలో లీ గజ్జెకట్టిన గంటల్లోనే ఆ నాట్య విన్యాసాలు అంతటా వింతగొలిపాయి. కానీ, ఇప్పటికి 34 ఏండ్ల కిందట 1990లో జిన్ షాన్‌షాన్ భారత్‌లో అడుగుపెట్టింది. చైనాలోని పెకింగ్ విశ్వవిద్యాలయంలో పొందిన ఉపకార వేతనాన్ని వెచ్చించి ఇక్కడికి వచ్చింది. భరత నాట్య కళాకారిణి, నాట్య గురువు లీలా శాంసన్ తలుపు తట్టింది. తనకు నాట్యం నేర్పించమని అభ్యర్థించింది. కుదరదన్నారు గురువు. నిరాశగా వెనుదిరిగింది. నెల తిరగకుండానే మళ్లీ వచ్చింది. నాట్యం నేర్పమని కోరింది. ఈసారీ అవకాశం లేదన్నారు లీలా శాంసన్. మళ్లీ వెనక్కి వెళ్లింది. నెల తిరక్కుండానే మొండిగా వెనక్కి వచ్చింది. 'మీ శిష్యురాలిగా స్వీకరించమ'ని అడిగింది. జిన్ షాన్ తపన గురువుకు నచ్చింది. తన శిష్యబృందంలో ఈ చైనా అమ్మాయికి చోటిచ్చింది. శిక్షణ మొదలైంది. జిన్ ఉత్సాహం చూసి లీలా శాంసన్‌కు ముచ్చటేసింది. మొదట్లో భాష రాకున్నా.. భావాన్ని ఇట్టే పసిగట్టేది. చిట్టి కండ్లతోనే చక్కటి అభినయాన్ని ప్రదర్శించే ఆమె వైనాన్ని చూసి అబ్బురపడ్డారు గురువు. దాదాపు ఎనిమిదిన్నరేండ్ల సాధన. అడపాదడపా స్వదేశానికి వెళ్లి వస్తుండేది. చివరికి 1999లో లీలా శాంసన్ ఆధ్వర్యంలో దిల్లీలో అరంగేట్రం చేసింది జిన్. ఓ చైనా అమ్మాయి భరతనాట్య ప్రదర్శన అప్పట్లో అద్భుతం.




**ఒక్కసారి** మువ్వలతో జతకట్టిన పాదాలు ఊరికే ఉంటాయా. సొంతూరుకు వెళ్తూ జిన్ భారతీయాన్ని తన వెంటే తీసుకువెళ్లింది. చైనా చేరాక ఆమె ప్రదర్శనలకే పరిమితం కాలేదు. గురువుగా అవతారం ఎత్తింది. తన ఇంట్లోనే అక్కడి చిన్నారులకు నాట్యకళ నేర్పించడం పనిగా పెట్టుకుంది. ఎందరికో నేర్పింది. కొందరు ఆటవిడుపుగా నేర్చుకున్నారు. ఇంకొందరు మధ్యలోనే ఆగిపోయారు. తన కూతురుకు కూడా భరతనాట్యం నేర్పింది. ఈ శిష్యబృందం నుంచి వచ్చిందే లీ ముజి. జిన్‌కు వచ్చిన విద్యనంతా ఆమె ఒడిసిపట్టింది. ఒకటి రెండు సంవత్సరాల్లో పైపైన సాధన చేసి... కిందామీదా పడుతూ ఓ ప్రదర్శన ఇచ్చేసి అరంగేట్రం అనిపించుకోలేదు! పదేండ్లు పరిశ్రమించింది. ప్రతీ వారాంతం రెండు రోజులు గురువు ఇంటికి వెళ్లేది. గంటల కొద్దీ నాట్యం నేర్చుకునేది. మళ్లీ వారానికి వచ్చినప్పుడు.. అంతకుముందు నేర్చుకున్న విద్యనంతా అద్భుతంగా ప్రదర్శించేది. ఇలా భారతంలో ఒడిసిపట్టిన విద్యనంతా చైనాలో తన శిష్యుల పరం చేసింది జిన్ షాన్. లీ ముజి అరంగేట్రంతోనే ప్రపంచాన్ని ఆకట్టుకుంది. లీ మాత్రమే కాదు... మువ్వల కాళ్లతో ముచ్చటగొలుపుతున్న చీనా చిన్నారులు మరెందరో ఉన్నారు. వాళ్లంతా ఆరితేరిన రోజు.. చైనా గోడపై మన అందెలు విందు చేయడం ఖాయం!!

## 'ఝూంగ్' భళా

లీ ముజి గురువు జిన్ షాన్ మరో గురువు చైనాలో లబ్ధప్రతిష్ఠురాలైన నాట్యకారిణి ఝూంగ్ జున్. 1950 ప్రాంతంలో భారత్‌కు వచ్చిన ఝూంగ్.. ఇక్కడి శాస్త్రీయ నాట్యాన్ని చూసి ముగ్ధురాలైంది. ఏడు పర్యాయాలు భారత్‌కు వచ్చి.. రకరకాల నృత్యరీతులను ఆకళింపు చేసుకున్నది. బిర్జూ మహారాజ్ శిష్యరికంలో కథక్‌లో ఓనమాలు దిద్దింది. చెన్నైలో కొంతకాలం ఉండి భరతనాట్యం అభ్యసించింది. కథాకళిలోనూ ప్రవేశించింది. చైనాలో ఎందరికో శాస్త్రీయ నాట్యం నేర్పింది. 2012లో ఝూంగ్ కాలం చేసింది. ఆమె శిష్యురాలిగా భరతనాట్యంపై పట్టు సాధించిన జిన్.. తన గురువు బాటలోనే పయనిస్తున్నది. జిన్ శిష్యురాలు లీ.. మరో తరానికి భారతీయ కళను చేరువ చేస్తుందనడంలో సందేహం లేదు.


# స్మార్ట్ సెక్యూరిటీ





**మహిళలు,** ఆడపిల్లల సేఫ్టీకి ప్రతి ఒక్కరూ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. నేటి పరిస్థితుల్లో ఇవ్వాలి కూడా. మనకు ప్రియమైన వాళ్లు ఎప్పుడు, ఎక్కడికి వెళ్లినా సేఫ్‌గా ఉన్నారనే భరోసా టెక్నాలజీతో లభిస్తుంది. అందుకే చాలా కంపెనీలు మొబైల్ యాప్స్ తయారీకి ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇప్పటికే చాలా సేఫ్టీ యాప్‌లు వినియోగంలో ఉన్నాయి. సైలెంట్ బీకన్ (Silent Beacon) యాప్ ఈ తరహాదే! మహిళలు, చిన్నపిల్లలు, ఉద్యోగినులకు సెక్యూరిటీ గార్డ్‌గా ఇది పని చేస్తుంది. ముందుగా గూగుల్ ప్లే స్టోర్ నుంచి సైలెంట్ బీకన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. మొబైల్ నంబర్, మెయిల్ ఐడీలతో రిజిస్టర్ అవ్వాలి. తర్వాత పేరు, వయసు సహా తదితర వివరాలు నమోదు చేసుకోవాలి. తర్వాత కుటుంబసభ్యులు లేదా గార్డియన్లకు చెందిన 8 మంది వివరాలను ఎంటర్ చేయాలి. ఎమర్జెన్సీ సమయంలో 911 నంబర్ లేదా మీరు ఎంపిక చేసుకున్న 8 మందికి అలర్ట్ పంపే విధంగా ఆప్షన్ ఎంచుకోవచ్చు. మెసేజ్‌లు, నోటిఫికేషన్లు, మెయిల్స్ ద్వారా కూడా అలర్ట్‌లు అందుతాయి. ఇప్పటికే ఈ అప్లికేషన్‌ను పదిలక్షల మందికిపైగా ఇన్‌స్టాల్ చేసుకుని సేఫ్‌జోన్‌లో జీవన యానం కొనసాగిస్తున్నారు.

# గూగుల్ ఫొటోస్‌లో నయా కలెక్షన్స్

హాట్ ఫీచర్!






**ఏం** చేసినా సెల్ఫీ.. ఎక్కడికి వెళ్లినా ఫొటో. జ్ఞాపకం ఏదైనా అన్నిటినీ ఫోన్‌లోనే భద్రం చేస్తున్నాం. ఆండ్రాయిడ్ యూజర్లు వాటిని కచ్చితంగా గూగుల్ ఫొటోస్‌లోకి సింక్ చేసేస్తారు. దీంతో ఫోన్‌లో బిల్టిన్‌గా ఉన్న ఫొటో గ్యాలరీ ఆప్షన్ కంటే 'గూగుల్ ఫొటోస్' ఫీచర్‌కే ఎక్కువ దగ్గరయ్యారు. అందుకే గూగుల్ ఫొటోస్ ఫీచర్‌ని మరింత కొత్తగా మలిచే పనిలో పడింది సదరు సంస్థ. హాట్ హాట్‌గా 'కలెక్షన్స్' ఫీచర్‌ని యూజర్ల ముందుకు తెచ్చింది. ఇప్పుడున్న 'లైబ్రరీ ట్యాబ్' స్థానంలో ఇది కనిపిస్తుంది. దీంతో మీ మొత్తం ఆల్బమ్స్‌ని కొత్తగా చూడొచ్చు. దీని గురించి సింపుల్‌గా చెప్పాలంటే... ఇంట్లో మన బీరువాలో దుస్తుల్ని కలెక్షన్స్ వారీగా ఎలా సర్దుకుంటామో అలాగే ఫొటోలను కూడా సర్ది మనకు చూపిస్తుందన్నమాట. అన్నీ ఒకేసారి చూసేందుకు 'ఆల్ వ్యూ' ట్యాప్ చేయొచ్చు. మీకు ఎవరైనా షేర్ చేసిన వాటిని 'షేర్డ్ విత్ మి'లో చూడొచ్చు. మొత్తం ఆల్బమ్స్ అన్నీ 'మై ఆల్బమ్స్'లో ఉంటాయి. ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లు ఈ అప్‌డేట్‌ని యాక్సెస్ చేయొచ్చు. ప్రైవసీ నిమిత్తం వాడే 'లాక్ ఫోల్డర్' ఫీచర్‌ని కలెక్షన్స్‌లో ప్రత్యేకంగా సెట్ చేసుకునే వీలుంది.

**'ఫొటో అసిస్టెంట్' కూడా..**

గ్యాడ్జెట్‌పై ఏదైనా టైపింగ్ చేయడం గానీ, స్క్రీన్‌ను తాకడం గానీ ఇప్పుడు తగ్గించేశాం. మనకు ఏం కావాలన్నా వాయిస్ అసిస్టెంట్‌ను అడుగుతున్నాం. అంతలా పిలిస్తే పలికే అసిస్టెంట్‌లు తాకే తెరపై సిద్ధంగా ఉన్నాయి. అందుకే... ఇకపై గూగుల్ ఫొటోస్‌లో మీ గ్యాలరీలను బ్రౌజ్ చేసేటప్పుడు కూడా 'ఫొటో అసిస్టెంట్'ని అడగొచ్చు. గూగుల్ ఏఐతో ఈ అసిస్టెంట్ పనిచేస్తుంది. అందుకే దీన్ని 'ఆస్క్ ఫొటోస్' ఫీచర్‌గా పిలుస్తున్నారు. త్వరలోనే గూగుల్ జెమిని ఈ ఫీచర్‌ని మోసుకొచ్చేందుకు సిద్ధం అవుతున్నది.